క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన శిరివరం విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు సంపత్ కుమార్ సోమవారం తెలిపారు. శిరివరం సర్పంచ్ నేత్రావతి కుమార్తె (8వ తరగతి) స్ఫూర్తి ఏలూరు జిల్లా కైకారంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచి 4×100 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకాన్ని సాధించింది. 7వ తరగతి చదువుతున్న మహిధర్ అన్నమయ్య జిల్లా అంగల్లులో నిర్వహించిన జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. 8వ తరగతి చదువుతున్న ఎం.అభిలాష్ అనే విద్యార్థి జిల్లా స్థాయి వాలిబాల్ పోటీల్లో పాల్గొని విజయనగరం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వారు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న శంకరనారాయణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని గీతానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణస్వామిని మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ సోమవారం పరామర్శించారు. నారాయణస్వామి ఇటీవల గోరీబిదనూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న శంకరనారాయణ, నాయకులు ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ ఈశ్వరయ్య , వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, నారాయణ రెడ్డి, పాల్గొన్నారు.

అమ్ముడుపోని వేరుశనగ



మడకశిర రూరల్: ఇటీవల అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు తొలగించిన వేరుశనగ పొలంలోనే తడిసి కుళ్లిపోయింది. కాస్తో కూస్తో చేతికందిన వేరుశనగ ధర పలకడం లేదు. రైతు రవికుమార్ సోమవారం వేరుశనగ కాయలు విక్రయించేందుకు మడకశిర పట్టణానికి వచ్చాడు. వేరుశనగ నల్లబారిపోవడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపించలేదు. దీంతో చేసేది ఏమీ లేక రైతు తిరిగి వాహనంలో వేరుశనగ బస్తాలను ఇంటికి తీసుకొచ్చాడు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఎస్‌ఎల్‌టీపీ కమిటీలో చోటు



ఉపాధ్యాయుడు కరియన్న

మడకశిర రూరల్: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీపీ) నూతనంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీలో మడకశిర మండలం జిల్లెడుగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న కరియన్నకు చోటు దక్కింది. తెలుగుభాషకు సేవలందిస్తూ భాషోద్యమ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో తన గళం వినిపించిన కరియన్నకు రాష్ట్ర భాషోపాధ్యాయ కమిటీలో న్యాయ సలహాదారుడిగా అవకాశం కల్పించారు. అలాగే గౌడనహళ్ళి ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు నరసింహమూర్తిని రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సోమవారం పాఠశాలలో నరసింహమూర్తిని సన్మానించారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ విద్యార్థినిగా నూర్ ఎ కొనైన్



ఉత్తమ విద్యార్థిగా అవార్డు అందుకుంటున్న నూర్ ఎ కొనైన్

పరిగి: మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరం పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన నూర్ ఎ కొనైన్ రాష్ట్ర స్థాయి ఉత్తమ విద్యార్థినిగా ఎంపికైనట్లు ఎంఈఓ లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. ఈమేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్, డీఈఓ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంది. నూర్ ఏ కొనైన్‌కు పాఠశాల హెచ్‌ఎం బాబా ఫక్రుద్దీన్‌తో పాటు అధికారులు, తల్లిదండ్రులు, పుర ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

వరి పంట..తెగులుతో తంటా

- దోమ పోటు (సుడి దోమ)తో తుడిచిపెట్టుకుపోతున్న పంట
- ఆందోళనలో అన్నదాతలు
- ప్రభుత్వ పరిహారం కోసం ఎదురుచూపు



తెగులుతో ఎండిపోతున్న వరి పంట

పెనుకొండ రూరల్: వేరుశనగ సాగు చేసి, నష్టాలు చవిచూస్తున్న రైతులు.. వరి పంటపై ఆశలు పెంచుకొని సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చిన సమయంలో సుడిదోమ తెగులుతో పంట నిలువునా ఎండిపోతోంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలలపాటు కంటికిరెప్పలా కాపాడుకుంటే తెగులు రూపంలో పంట చేతికందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గం వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 4,388 ఎకరాల వరకు వరి పంట సాగు చేశారు. పెనుకొండ మండలంలో 350 ఎకరాలు, రొద్దం మండలంలో 460 ఎకరాలు, సోమందేపల్లి మండలంలో 192 ఎకరాలు, గోరంట్ల మండలంలో 3000 ఎకరాలు, పరిగిమండలంలో 386 ఎకరాల వరకు సాగు చేశారు. మండలంలోని చంద్రగిరి గ్రామంలో వంద మంది రైతులు వరి పంట వంద ఎకరాలు పైబడి సాగు చేశారు. ఎకరం సాగు చేసేందుకు రూ.40వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు తెలిపారు. ఖరీఫ్ సీజన్ కింద ఆగస్టు మొదటి వారంలో వరి నాట్లు వేశారు. నాలుగు నెలలు పాటు పంట కాపాడుకుంటూ వచ్చారు. మరో పదిహేను రోజుల్లో వరి పంట కోత కోయాల్సి ఉంది. వారం రోజులుగా సుడిదోమ (దోమపోటు)తో నిలువునా ఎండిపోతోంది. పంటకు డీఏపీ, కాంప్లెక్స్, అమ్మోనియం సల్ఫేట్ ఎరువులు వాడారు. తెగులు నివారణకు మోనోక్రోటోఫాస్, అస్ఫెట్ మందులు వాడినా ఫలితంలేదు. రూ.వేలు ఖర్చు చేసినా తెగులు తగ్గుముఖం పట్టలేదు. పంట చేతికి అందితే ఎకరానికి 40 బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో క్వింటా ధర రూ. 2,500 నుంచి రూ.3వేల వరకు పలుకుతోంది. పెట్టుబడి పోనూ రూ.35 వేల నుంచి రూ. 40 వేల వరకు మిగిలేదని రైతులు చెప్తున్నారు. వరి పంట తెగులు బారిన పడడంతో పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమ పోటు (సుడి దోమ) తెగులుతో తంటా

వెంకటగిరి పాళ్యం సమీపంలో సాగు చేసిన వరి పంటను వ్యవసాయ అధికారి చందన, ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య పరిశీలించారు. వరి పంటకు దోమపోటు తెగులు సోకినట్లు నిర్ధారించారు. తుఫాను కారణంగా తెగులు వ్యాపిస్తుందన్నారు. క్రిమి సంహారక రసాయనాలు క్వినాల్ ఫాస్, ప్రొఫెనో ఫాస్, సింథిటిక్ పైరిత్రియాడ్ పిచికారీ చేసి, తెగులు నివారించొచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. గాలీవెలుతురు లేని కారణంగా దోమపోటు తెగులు సోకుతుందని తెలిపారు. సాగు చేసే సమయంలో పంట మధ్యలో కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంట మార్పిడి పద్ధతులను రైతులు అలవర్చుకోవాలన్నారు.

వరి రైతుకు బీమా ప్రకటించాలి



మూడు ఎకరాల మేర వరి పంట సాగు చేశాను. దాదాపుగా రూ.లక్షకు పైబడి పెట్టుబడి వచ్చింది. నాలుగు నెలల పాటు పంటను చూసుకున్నాను. తీరా పంట చేతికి అందే సమయానికి పంట మొత్తం తెగులు బారిన పడింది. ప్రభుత్వం వరి రైతుకు బీమా ప్రకటించాలి.

– జయరాములు, రైతు, వెంకటగిరిపాళ్యం

దోమపోటు దెబ్బ



గ్రామంలో దాదాపుగా వంద మంది వరకు రైతులు వంద ఎకరాలు పైబడి వరి పంట సాగు చేశారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేశాం. తెగుళ్లు సోకడంతో ఇటీవల ఉన్నఫలంగా పైరు ఎండుముఖం పట్టింది. పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటయ్యేలా లేదు. వరి రైతుకు పెద్ద దెబ్బ తగిలింది. ప్రభుత్వం వరి రైతులను ఆదుకోవాలి.

– ఆదినారాయణ, రైతు, వెంకటగిరిపాళ్యం

ప్రజలకు నిరాశ మిగిల్చిన బడ్జెట్



సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలకు నిరాశ మిగిల్చిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఈ బడ్జెట్ ఏ మాత్రం ఉపయోగపడదన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. ఇది అంకెల గారడీ బడ్జెట్. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, తదితర ప్రాధాన్యత రంగాలకు బడ్జెట్‌లో నిధులు నామామాత్రంగా కేటాయించడం అన్యాయమని తెలిపారు.

చింతఫల సాయం వేలం

రొళ్ల: మండల పరిధిలోని హులికుంట పంచాయతీ కేంద్రంలో సోమవారం వన్నారనపల్లి చింతఫల సాయాన్ని వేలం వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. వన్నారనపల్లి గ్రామానికి చెందిన నరసప్ప అనే వ్యక్తి రూ.60 వేలకు చింతఫల సాయాన్ని వేలం పాటలో దక్కించుకున్నారు. వేలం పాడిన మొత్తాన్ని రెండు రోజుల్లోగా పంచాయతీకి జమ చేయాల్సి ఉందన్నారు. ఒక వేళ జమ చేయకపోతే తిరిగి చింతఫల సాయాన్ని వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. వేలం పాటలో వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలో జరిగే అభివృద్ధి పనులకు నిధులు ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో రొళ్ల పంచాయతీ కార్యదర్శి బాబురావు పాల్గొన్నారు.

పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎస్టీయూ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వం చేపట్టిన పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యాక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ ఇదివరకే వచ్చిందని, వివిధ కారణాలతో షెడ్యూల్ మేరకు జరగాల్సిన పదోన్నతుల ప్రక్రియ నిలిచిన నేపథ్యంలో రీ షెడ్యూల్ విడుదల చేసి పదోన్నతులు చేపట్టాలన్నారు. 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించి బోధనకు పరిమితం చేయాలని, 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అపార్ గడువు పొడిగించాలని, 117 జీఓ రద్దుచేసి పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ శాఖ అధ్యక్షుడు షమీవుల్లా, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఇమ్రాన్, ప్రవీణ్ తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



మేళాపురంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

హిందూపురం నెట్‌వర్క్: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని శివాలయాల్లో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా మహిళలు శివాలయాలకు తరలివచ్చి ఆలయ ప్రగంణంలో ధ్వజస్తంభం, శవివృక్షం నాగుల కట్టల వద్ద కార్తీకదీపాలు వెలిగించి, పూజలు నిర్వహించారు.

సేంద్రియ వ్యవసాయం శ్రేయస్కరం



మాట్లాడుతున్న ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్

లేపాక్షి: సేంద్రియ వ్యవసాయం శ్రేయస్కరమని ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం హిందూపురం వ్యవసాయ డివిజన్‌లోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, గోరంట్ల మండలాలకు సంబంధించిన పొలంబడి రైతులు, ఎఫ్‌పీఓ గ్రూపు సభ్యులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన, అధిక దిగుబడి సాధించే దిశగా పొలంబడి కార్యక్రమం నిర్వహించాలన్నారు. సీడ్ సర్టిఫికేషన్ అధికారి సునీల్ మాట్లాడుతూ పొలంబడిలో రైతులు పండించిన మొక్కజొన్న పంటకు సర్టిఫికేషన్ ఇస్తామని, పంట దిగుబడిని శిరివరం కంబాలరాయుడు ఎఫ్‌పీఓ గ్రూపుద్వారా కొనుగోలు చేస్తామన్నారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ జీఏపీ పొలంబడిలో పురుగుల మందుల వాడకం తగ్గించి, సేంద్రియ పద్ధతులు ద్వారా ఖర్చు తగ్గించి అధిక దిగుబడిని ఏవిధంగా సాధించవచ్చో వివరించారు. అనంతరం భూసార పరీక్షలు, విత్తనశుద్ధి, సమగ్ర పోషకాల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, ఏఈఓలు, వీఏఏఎస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర రూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వనాథ్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఒణికె ఓబవ్వకు ఘన నివాళి

పావగడ: చిత్రదుర్గం కోటను సొరంగ మార్గంలో ముట్టడించడానికి వస్తున్న వందలాది మంది హైదరాలి సైనికులను రోకలిని (ఒణికె) ఆయుధంగా చేసుకుని మట్టు బెట్టిన వీర వనిత ఓబవ్వ అని పలువురు కొనియాడారు. సోమవారం స్థానిక తాలూకా కార్యాలయంలో ఒణికె ఓబవ్వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ వరదరాజు, తదితరులు ఒణికె ఓబవ్వ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆమె ధైర్యసాహసాలను వివరించారు.

ఘనంగా అబుల్ కలాం జయంతి

పెనుకొండ: పట్టణంలో అబుల్ కలాం జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కేశవరావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్, ఘనగిరి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఇలియాజ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

చిలమత్తూరు: ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం కొత్తచామలపల్లి సమీపంలో ఉపాధి పనులు పరిశీలించి, కూలీల సమస్యలు తెలుసుకున్నారు.

వార్డులో సమస్యల పరిశీలన

పెనుకొండ: పట్టణంలోని ఏడో వార్డులో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సోమవారం పలు సమస్యలను పరిశీలించారు. డ్రైనేజీలో పూడిక తీయడానికి చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ ఇంజనీర్ పవన్‌కుమార్‌ను ఆదేశించారు.

అంగన్‌వాడీ సెంటర్ల అద్దె చెల్లించాలి

హిందూపురం టౌన్: హిందూపురం ఐసీడీఎస్ పరిధిలో అద్దె కేంద్రాల్లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లకు బిల్లులు చెల్లించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, కార్యాలయ బీపీసీ వరుణ్‌కు వినతిపత్రాన్ని అందించారు. మూడు రోజుల్లోపు బిల్లులు చెల్లించకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలి

రొద్దం: మండలంలోని కోగిర, కంబాలపల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ నాగేంద్రకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

పీఠాధిపతి కుమారుడికి సన్మానం



పెనుకొండ: పట్టణంలో ప్రఖ్యాతి గాంచిన బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా కుమారుడు నజర్‌హుసేనిని సోమవారం సన్మానించారు. జాతీయ సమైక్యత, మతసామరస్యం కోసం కులమతాలకతీతంగా తాజ్‌బాబా బృందం 41 రోజుల పాటు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ముమ్మరంగా పాదయాత్ర చేసింది. మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని నజర్‌హుసేని సన్మానించారు.

ఆర్‌ఆర్ ప్యాకేజ్ చెల్లింపునకు చర్యలు తీసుకోండి

గోరంట్ల: ఆర్‌ఆర్ ప్యాకేజ్ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చేతన్‌ను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకుడు పెద్దన్న కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందించారు. పాలసముద్రం వద్ద కేంద్ర ప్రభుత్వం బెల్, నాసిన్ నిమిత్తం భూసేకరణ చట్టం కింద భూములు తీసుకున్నారని, ఆర్‌ఆర్ ప్యాకేజ్ కింద 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సభ్యులు రమాదేవి తదతరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సోమందేపల్లి: గీతానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చింతా హరి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుడి కుటుంబ సభ్యులను తొగట వీర క్షత్రీయ సంఘం అధ్యక్షుడు సీసీ హరి తదితరులు పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. చేనేత కార్మిక సంఘం నాయకులు గుడూరు రమేష్, శివా, జగదీష్ గోపాల్, గంగాదర్, మహేంద్ర పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. సోమవారం మండలంలోని రత్నగిరి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో రికార్డులు పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఎండీఎం నిర్వహకులు తప్పనిసరిగా మెనూ పాటించాలని సూచించారు. ఎఫ్‌ఏ-2 సమాధాన పత్రాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. హెచ్‌ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

13 వినతులు

పెనుకొండ రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 13 ఫిర్యాదులు అందినట్లు డీటీ ప్రసాద్ తెలిపారు.

వైభవంగా శనీశ్వరుడి రథోత్సవం



బెంగళూరు రోడ్డులో సాగుతున్న రథోత్సవం

హిందూపురం: పట్టణంలోని బెంగళూరు రోడ్డు టీచర్స్‌కాలనీలోని శనీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ 24వవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బ్రహ్మరథోత్సవం, కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అలయ మూలవిరాట్ శనేశ్వరస్వామికి పంచమృతాభిషేకం, తిలతైలాభిషేకం నిర్వహించి బంగారు కవచ ధారణతో పాటు బెంగళూరు నుంచి తెప్పించిన విశేషపుష్పాలంకరణ చేశారు. ఈ సందర్భంగా అశేష భక్తజనవాహిణి నడుమ కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా చేపట్టారు. అనంతరం వేలాదిమంది భక్తుల నడుమ రథోత్సవం నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రగంణంలోని ఉసిరిచెట్టుకు పూజలుచేసి కార్తీక దీపాలు వెలిగించి ప్రదక్షణలు చేశారు. అనంతరం అన్నదానం చేట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



పెద్దకోడిపల్లిలో జ్యోతులు మోస్తున్న మహిళలు

రొద్దం: మండల పరిధిలోని పెద్దకోడిపల్లి గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకను సోమవారం నిర్వహించారు. ఉదయం మహిళలు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రికి వాల్మీకి చిత్ర పటాన్ని గ్రామంలో ఊరేగించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెనుకొండ రూరల్: మండలంలోని బండ్లపల్లికి చెందిన మంజు నుంచి 95 ఓసీ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సృజన్ బాబు సోమవారం తెలిపారు.

రైల్వేస్టేషన్ రోడ్డును పునరుద్ధరిస్తాం



రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పెనుకొండ: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డునాలుగు నెలల్లో పునరుద్ధరిస్తామని ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. గత నాలుగు రోజుల క్రితం ‘సాక్షి’లో అధ్వానంగా రైల్వేస్టేషన్ రహదారి శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీ.. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలించారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు.

ఘనంగా బొమ్మలింగేశ్వర స్వామి ఉత్సవం



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అగళి: మండల పరిధిలోని అక్కగార్ల దేవరపల్లి పొలిమేరలో వెలసిన ఏడుగురు అమ్మవార్లు మూడుపమ్మ, చిక్కమ్మ మారక్క, కావలమ్మ, జీరిగాలమ్మ, రట్టాలమ్మ, మల్లమ్మ, సోదరా మావయ్య బొమ్మలింగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. పునః ప్రతిష్ఠించిన విగ్రహాలను వివిధ రకాల పూలు, వెండి ఆభరణలతో అలంకరించి, ఉత్సవం నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వేలలో సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

దివ్యాంగులకు ట్రై స్కూటర్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై స్కూటర్లు పంపిణీ చేసిన దృశ్యం

పావగడ: కర్ణాటక రాష్ట్ర దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమ శాఖ నుంచి మంజూరైన 20 ట్రై స్కూటర్లను స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ 20 మంది దివ్యాంగులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కేఎస్ సుధీంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నిధుల్లో దివ్యాంగుల అభివృద్ధికి వినియోగించాల్సిన ఏటా రూ 20 లక్షల నిధులను గత 7 సంవత్సరాలుగా అందించలేదన్నారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా మమ్మల్ని పరిగణలోకి తీసుకోక పోవడం శోచనీయమన్నారు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోపు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకి రాం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏ.శంకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలి

సోమందేపల్లి: హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీ నిర్వాహకులు ఆహార భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బేకరీలు, హోటళ్లతోపాటు కిరాణాషాపులను తనిఖీ చేశారు. వైఎస్సార్ సర్కిల్‌లోని ఓ హోటల్‌లో గడువు దాటిన రోటీ, మష్రూం ప్యాకెట్లతో పాటు బిరియానీ రైస్, బోటీ కూర ఫ్రీజ్‌లలో నిల్వ ఉంచడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బేకరీలో ఆహార పదార్థాలు విక్రయానికి సిద్ధం చేసే కూరగాయలు, ఆయిల్ నాణ్యత లేకపోవడతో నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ లేకపోవడంతో నోటీసులు ఇచ్చారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

రొద్దం: యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కంబాలపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న గంగాధర్‌ను సాంస్కృతిక కన్వీనర్‌గా ఎన్నుకున్నట్లు తెలిపారు.

అక్రమంగా నీలగిరి చెట్ల నరికివేత



నీలగిరి చెట్లను నరికివేసిన దృశ్యం

లేపాక్షి: ఆంధ్ర సరిహద్దు కంచిసముద్రం పొలం ఓటుకుంట వద్ద నీలగిరి చెట్లను కొందరు స్వార్థపరులు ఆదివారం సాయంత్రం నరికి వేసి ఆ కలపను తరలించి సొమ్ము చేసుకున్నారు. 15 సంవత్సరాల క్రితం కంచిసముద్రం వాటర్ షెడ్ పథకం కింద ఓటుకుంటలో నీలగిరి మొక్కలు నాటారు. కొంత మంది స్వార్థపరులు సెలవు దినం చూసుకుని బాగా పెరిగిన నీలగిరి చెట్లను నరికి, కలపను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వాటి విలువ రూ.75 వేలు ఉంటుందని సమాచారం. కాగా అటవీశాఖ అధికారులకు తెలియకుండా ఈ వ్యవహారం జరిగి ఉండకపోవచ్చని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.